# సబ్‌స్టేషన్ కల సాకారం

- కవిటిలో రూ.3.48 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ ప్రారంభం
- ప్రజలకు అంకితం చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి :

ఐదు దశాబ్దాలుగా కవిటి మండల ప్రజలకు తీరని కోరికగా మిగిలిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు ఎట్టకేలకు సాకారం కావడం ఆనందంగా ఉందని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటిలో రూ.3.48 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిటి మండల ప్రజలందరికీ చేరువయ్యేలా సబ్‌స్టేషన్ ఆవరణలోనే మండల విద్యుత్‌శాఖ కార్యాలయం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇకపై ప్రజలంతా విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు నేరుగా ఈ సబ్‌స్టేషన్ ఆవరణలోని కార్యాలయంలో ట్రాన్స్‌కో ఇంజినీర్‌ను సంప్రదించవచ్చన్నారు. అంతేకాకుండా కవిటి మండలంలోని 23 సచివాలయాల పరిధిలో టౌన్‌ఫీడర్‌గా గుర్తించి త్రీఫేస్ కింద అన్ని గ్రామాల పరిధిలో 24 గంటల నిరంతరాయమైన నాణ్యమైన విద్యుత్ సరఫరా ఏర్పాటుకు పైలట్ ప్రాజెక్ట్ కింద ఏపీ ఈపీడీసీఎల్ విశాఖ రీజియన్ అధికారులు అవకాశం కల్పించారని వివరించారు. 24 గంటల త్రీఫేస్‌ను దశలవారీగా ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట వ్యాప్తంగా కల్పించేందుకు విశాఖ రీజియన్ సీఎండీ ఆమోదం తెలిపారని సాయిరాజ్ తెలిపారు.దీంతో పాటు కొర్లాంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీనికి సంబంధించి ఫైల్ ఆమోదం కూడా తుదిదశకు చేరిందన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతంగా గుర్తించి కన్సీల్డ్ కండక్టర్ ద్వారా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. దశలవారీగా పనులు అతిత్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా వ్యవసాయానికి ఉచితవిద్యుత్‌తో కపాసుకుద్ది, కవిటి, పుటియాదళ రెవెన్యూగ్రామాల్లోని సుమారు 600 విద్యుత్ పంప్ సెట్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ కవిటి మండల ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడంలో సాయిరాజ్ చొరవ ప్రశంసనీయమైనదన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ జె.యుగంధర్, ఏఎంసీ చైర్మన్ ఎస్.బాబూరావు, సోంపేట ఎంపీపీ డాక్టర్ ఎస్.దాస్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, పూడి నేతాజీ, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, ఎం.శంకర్, ధర్మారావు, పి.శేఖర్, వై.అశోక్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కవిటిలో కొత్తసబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పిరియా సాయిరాజ్




## క్లుప్తంగా

### అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నేడు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం, ఉద్దానం గోపినాథపురం, అమలపాడు పెద్దమురహరిపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ప్రారంభోత్సవం చేయనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 3.85 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, బీటీ రహదారి, రైతు భరోసా కేంద్రం, పాఠశాల భవనం, ప్రయాణికుల విశ్రాంతి భవనాలను మంత్రి ప్రారంభిస్తారని, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

### అయోధ్యకు పయనం



కాశీబుగ్గ: అయోధ్యలో రాముని దర్శనానికి పలాస నుంచి సుమారు రెండు వందల మంది భక్తులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. తక్కువ చార్జీకే రానుపోను అవకాశం, భోజన సౌకర్యాలు కల్పించడంతో డిమాండ్ పెరిగింది. విశాఖపట్నం నుంచి పలాస మీదుగా అయోధ్యకు వెళ్తుండటంతో రైలు వద్ద భక్తులు సందడి చేశారు.

### విద్యార్థికి ఆర్థిక సాయం



భవానీశంకర్‌కు సాయం అందిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: తలగాంలో వా రం కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయ పడిన డిగ్రీ విద్యార్థి భవానీశంకర్‌కు ఏబీవీపీ నాయకులు వివిధ పాఠశాలల్లోని విద్యార్థుల సాయంతో రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్న విద్యార్థి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఏబీవీపీ నాయకులు కొన్ని మురళి తెలిపారు.

### మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కంచిలి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పురుషోత్తపురం పంచాయతీ గెద్దలపాడు చెరువులో సిమెంట్ మెట్ల నిర్మాణాన్ని రూ.15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.2.5లక్షల వ్యయంతో నిర్మించారు. ఈ నిర్మాణాన్ని ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు పైల మోహన్‌రావు, వంకల ఉమాపతి, ఉప్పాడ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


### పరీక్షలపై భయం వీడాలి



ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాల పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఇచ్ఛాపురం: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడితే మంచి మార్కులు సాధించవచ్చని ఎంఈఓ కె.అప్పారావు అన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఫార్మెటివ్ అసెస్మెంట్-4 పరీక్షలను పలు పాఠశాలల్లో పర్యవేక్షించారు.

### విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం కండ్రావార్డు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడు ప్రశాంత్ లిమ్మాయి క్రీడా దుస్తులు బహుకరించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గౌరహరి బెహరా చేతుల మీదుగా 20 మందికి వీటిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం బి.రామారావు, ఉపాధ్యాయులు భాస్కర్ పాడీ, సురేష్ పాడీ, సబితా కుమారీ, ఉషారాణి పాల్గొన్నారు.

### నేటి నుంచి గోవింద కోటి నామాల సప్తాహం

టెక్కలి: పట్టణంలో శనివారం నుంచి కోటి గోవింద నామాల సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర గీతా భక్త బృందం ప్రతినిధులు పాద సోమశేఖరశాస్త్రి, టంకాల పావనిరాణి, గేదెల చంద్రశేఖర్, దుక్క రమేష్ రెడ్డి తదితరులు శుక్రవారం తెలిపారు. తొలుసూరుపల్లి రోడ్డులోని సాయిచంద్రనగర్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 3 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని, భక్తులు హాజరు కావాలన్నారు.

# ఆరు గంటలు ఉపాధి పనిచేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

సంతబొమ్మాళి: రోజుకు కనీసం 6 గంటల పాటు ఉపాధి పని చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 34 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై శుక్రవారం సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 1422 పనులు చేపట్టగా రూ.18.94 కోట్లు ఖర్చుపై సోషల్ ఆడిట్ నిర్వహించి గుర్తించిన అవినీతి, అక్రమాలను డీఆర్పీలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చనిపోయిన వారి పేరిట తప్పుడు మస్టర్లు, బినామీ మస్టర్లు వేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఉపాధి పనికి ఫొటోలు, వీడియోలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రికవరీలు చెల్లించకపోతే ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ శైలజ, మురళీకృష్ణ, విజిలెన్స్ అధికారి లవరాజు, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఉపాధి పథకంతో వలసల నివారణ



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: ఉపాధి హామీ పథకంతో నివాసం ఉన్న చోటనే పనులు కల్పిస్తూ వలసలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. జలంత్రకోట పంచాయతీ నారాయణసాగర్‌లో మట్టి తవ్వకాల పనుల్ని ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. 200 మంది వేతనదారులతో ఈ పనుల్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక పార్టీ నేతలు ప్రకాష్ చంద్ర పండా, కొయిరా గౌడో, ఉజ్వల్ గౌడో, సుర్జీత్ గౌడో, మండల పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు లోకేష్, మాధవరావు, దుర్యోధన పాల్గొన్నారు.

### ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి



ఆటోడ్రైవర్ల సంఘ భవనం శంకుస్థాపనలో నాయకులు

కవిటి: ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం కవిటిలో ఆటోడ్రైవర్ల సంఘం భవన నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. రూ.4లక్షల జెడ్పీ నిధులు,రూ.2లక్షల మండల పరిషత్ నిధులతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, నాయకులు కె.ప్రకాష్, జె.యుగంధర్, దువ్వు కృష్ణారెడ్డి, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వై.అశోక్, పి.నేతాజీ, దేవరాజ్ సాహూ, పి.నీలాచలం, పి.శేఖర్, ధర్మారావు, శంకర్ పాల్గొన్నారు.

# పకడ్బందీగా గ్రామైక్య సంఘాల పుస్తక నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం ఫైనాన్స్ శ్రీనివాసబాబా

కంచిలి: గ్రామైక్య సంఘాల పుస్తక నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని డీపీఎం ఫైనాన్స్ శ్రీనివాసబాబా సూచించారు. కంచిలి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోంపేట క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల సమాఖ్యలు, 44 గ్రామైక్య సంఘాల ఇంటర్నల్ ఆడిట్ ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం ఐబీ, సోంపేట క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ కె.మోహనరావు మాట్లాడుతూ ప్రతీ స్వయంశక్తి సంఘం, గ్రామైక్య సంఘం ఏ గ్రేడ్‌కి వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం వీఓఏల పనితీరుపై చర్చించారు. సమావేశంలో ఉన్నతి ఏపీఎం శ్రీధర్, ఆరు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

**కొనక గ్రామంలో పరిశీలన..**

కొనక గ్రామంలో ఉన్నతి(ఎస్సీ, ఎస్టీ) రుణాలు(సున్నా వడ్డీ) మంజూరుపై ఉన్నతి ఏపీఎం శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రుణాలు ఆయా వర్గాలు కాకుండా మధ్యవర్తులు వాడుకొని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నదీ లేనిదీ సభ్యుల వద్దకు వెళ్లి విచారించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.ఉమారాణి, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు జగదీశ్వర యువజన సంఘం వార్షికోత్సవం

పలాస: బొడ్డపాడులో ఆదివారం జగదీశ్వర యువజన సంఘం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి తెలిపారు. తెలంగాణ ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖాధిపతి ప్రొఫెసర్ కాశీం, తెలంగాణ ధిక్కార స్వరం గాయకుడు చుక్కా రామయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు.

### సంతోషిమాతకు పూజలు



కంచిలి: మండలంలోని ఎక్కల గ్రామంలో సంతోషిమాత ఉజ్జాపనల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి సాయంత్రం అమ్మవారిని పూర్ణకుంభాలతో ఊరేగించారు. మేళతాళాలతో ఊరంతా సందడి వాతావరణం నెలకొంది.

### అగ్నికుల క్షత్రియ భవనానికి శంకుస్థాపన



కవిటి: మండలంలోని కె.కొత్తూరులో అగ్నికుల క్షత్రియ సంఘం సామాజిక భవన నిర్మాణానికి శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శంకుస్థాపన చేశారు. జెడ్పీ నిధులు రూ.4లక్షలు కేటాయించి ఈ భవనం నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. అంతకుముందు కె.కొత్తూరు జంక్షన్‌లో జెడ్పీ నిధులు రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు, పిరియా సాయిరాజ్ ప్రారంభించారు. నాయకులు దుక్క లోకేశ్వరరెడ్డి, కె.ప్రకాష్, ఎస్.బాబూరావు, డాక్టర్ దాస్, బోర పుష్ప, దేవదాస్‌రెడ్డి, ఉప్పాడ నారాయణమ్మ, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, ధర్మారావు, శంకర్, పి.నేతాజీ, పి.శేఖర్, వై.అశోక్ పాల్గొన్నారు.

### పలాస సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా రఘురాం



కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సీహెచ్ రఘురాం శుక్రవారం నియమితులయ్యారు. ఇప్పటి వరకు ప్రసూతి విభాగం వైద్యులు డాక్టర్ అన్నెపు సుశీల బాధ్యతలు నిర్వర్తించారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్య భారతం



డాక్టర్ రవివర్మను సన్మానిస్తున్న స్థానికులు

కవిటి: ఆయుర్వేదంతో ఆరోగ్యభారతాన్ని సృష్టించడం మహర్షులు మనకందించిన అద్భుతమైన వరమని విజయనగరం జిల్లా సారిపల్లి ధన్వంతరి సహస్రాయు ఆయుర్వేదపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ రవివర్మ అన్నారు. ముత్యాలపేటలో ఇటీవల ప్రారంభించిన మహీమృత్యుంజయేశ్వరుని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 600 మంది క్యాన్సర్, కిడ్నీ, కాలేయ, తదితర వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్యసేవలందించారు. రూ.9లక్షల విలువైన మందుల్ని ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రవివర్మను అన్ని గ్రామాలప్రజల సమక్షంలో పౌరసన్మానం చేశారు. ఏప్రిల్‌లో రెండు రోజుల పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తానని ఆయన ప్రకటించారు.

# పోటీతత్వంతోనే విజయం



పూజగౌడను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ శరత్‌బాబు, అధ్యాపకులు

మందస: పోటీతత్వంతోనే విజయ శిఖరాలను అందుకోవచ్చని మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు అన్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దృఢ సంకల్పంతో చదువుకోవాలన్నారు. జగనన్న ఆణిముత్యాలు పథకం ఎంతో ఉన్నత ఆశయంతో అమలు చేస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బైపీసీ విద్యార్థిని పూజగౌడ అత్యధిక మార్కులు సాధించడంతో సన్మానించి రూ.5వేల ప్రోత్సాహకం అందించారు. తల్లిదండ్రులు పురుషోత్తంగౌడ, మున్నోలను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎంఓ మార్పు కృష్ణమోహన్, అధ్యాపకులు బబుల సాహు, జి.అప్పలనాయుడు, హనుమంతు విజయలక్ష్మి, గోవిందరాజులు, బొడ్డు ప్రవీణ్‌కుమార్, నాగభూషణ, జానకిరావు, వెంకట్, నరేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం రైతు వ్యతిరేక విధానాలు వీడాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

మందస: కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మందస మండలం రాధాకృష్ణపురం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయసమ్మతమైన డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం తగదన్నారు. పోలీసు కాల్పుల్లో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించి కారకులపై కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, రైతు, కార్మిక సంఘాల నాయకులు టొంప లక్ష్మీనారాయణ, కె.కేశవరావు, పి.దేవేంద్ర, లచ్చయ్య, పోలయ్య, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ కుటుంబానికి మంత్రి పరామర్శ



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన సర్పంచ్ తామాడ పద్మావతి మామయ్య, అగ్నికుల క్షత్రియ సంఘ మాజీ అధ్యక్షుడు తామాడ వల్లయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం పరామర్శించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ తామాడ పద్మావతి, ఉప సర్పంచ్ సాహుకారి జాని, పార్టీ నాయకులు పోకల బాబూరావు, పెద్ద కోట అనంత్, రాజాం లక్ష్మణరావు, ఎన్ని అజయ్, పోకల శంకరరావు, చల్ల మోహనరావు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి సంఘాలే కీలకం



ఆర్గనైజర్లను సన్మానిస్తున్న సర్పంచ్ లోలాక్షి, సంఘ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళలు ఆర్థిక ఎదుగుదలకు స్వయంశక్తి సంఘాల పాత్ర కీలకమని అక్కుపల్లి సర్పంచ్ లండ లోలాక్షి అన్నారు. గ్రామంలో మత్స్యకార స్వయం శక్తి సంఘం ఏర్పాటై 25 ఏళ్లు పూర్తి కావడంతో అక్కుపల్లి శివసాగర్ పరిసర నీలకంఠేశ్వరాలయం ఆవరణంలో శుక్రవారం రజతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ఆర్గనైజర్ మడ్డు రాజేశ్వరి, సబ్‌ఆర్గనైజర్ మడ్డు జ్యోతిలను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కాగా రుణమాఫీ ద్వారా తమ సంఘానికి రూ. 4,11000 లబ్ధి చేకూరడంతో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్వయంశక్తి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తెలగ గర్జన విజయవంతం చేయండి



పలాసలో కరపత్రం ఆవిష్కరిస్తున్న తెలగ సంఘ పెద్దలు

కాశీబుగ్గ: విజయనగరం జిల్లా పూసపాటిరేగలో ఈ నెల 25న నిర్వహించనున్న తెలగ గర్జన విజయవంతం చేయాలని పలాస తెలగ సంఘ అధ్యక్షుడు శీలం రూప్‌సుందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పలాస రైల్వేస్టేషన్ రోడ్డులోని సీతారామాలయం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగ కులస్తులను ఓసీ నుంచి బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ తెలగ సంఘ రాష్ట్ర నాయకుడు పల్లంట వెంకటరామారావు ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బల్ల శ్రీనివాసరావు, అంది రామకృష్ణ, ప్రతాప్, చిరంజీవులు, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### అల్లుకోలలో వలంటీర్లకు సత్కారం



సత్కారం అందుకుంటున్న వలంటీర్లు

కాశీబుగ్గ: పలాస మండలం అల్లుకోల గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు రాధ, జమున, గౌతమి, సుధా, సంతోష్, బెహరా సంతోష్, సుందర్‌లను శుక్రవారం సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. అల్లుకోల సర్పంచ్ దువ్వాడ వామాక్షి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ దువ్వాడ రవికుమార్, అడ్మిన్ కద్దాల చిరంజీవులు, వార్డు సభ్యులు సత్యం, శ్రీను, తారక్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా...

### ఎనర్జీ అసిస్టెంట్ కుటుంబానికి పరామర్శ



దిలీప్ భార్యను ఓదార్చుతున్న కృపారాణి

టెక్కలి: తలగాం సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ దిలీప్ కుటుంబాన్ని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, రామ్మోహన్‌రావు పరామర్శించి ఓదార్చారు. శ్రీనివాసానగర్‌లో శుక్రవారం దిలీప్ అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు.

**నిందితులను శిక్షించాలి**

టెక్కలి: తలగాం గ్రామ సచివాలయానికి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ ఎండ దిలీప్ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనకు కారకులైన వారిని శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రామనగరం సమీపంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా కొంతమంది ఉద్దేశపూర్వకంగా స్విచ్ ఆన్ చేయడంతో ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు.

### అత్యధిక కేసుల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో మార్చి 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అత్యధికంగా కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. టెక్కలి కోర్టు సముదాయంలో శుక్రవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీమార్గాన్ని అనుసరించేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, ఏజీపీ జి.కృష్ణారావు, ఏపీపీ పి.వైకుంఠరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



కాశీబుగ్గ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం పునరావాస కాలనీకి చెందిన నావికాదళ అధికారి పిట్ట రవికుమార్ అన్నారు. 101 రకం బాదం మొక్కలను ప్రత్యేకంగా తీసుకువచ్చి కాలనీలో యువత సాయంతో నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

**తెలుగు భాషా సేవకుడికి సత్కారం**

కాశీబుగ్గ: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన విశ్రాంత వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తిని పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. జన జాగృతి పేరిట సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఏర్పాటు చేసి తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్నందున ఈ సన్మానం చేశారు.